సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం । 3 । మే । 2025



చీనీ టన్ను రూ.22,100
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.22100, కనిష్టంగా రూ.4 వేల ప్రకారం ధర పలికాయి.



వెయ్యేళ్ల చరిత్రకు సాక్ష్యం
వెయ్యేళ్ల చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన ధర్మవరంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 10లో



జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం అధికంగా కొనసాగుతోంది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

పలుచోట్ల వర్షం



గాలీవానకు చిప్పలమడుగులో నేలకొరిగిన మొక్కజొన్న పంట

పుట్టపర్తి అర్బన్: వాతావరణ మార్పులతో శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ముఖ్యంగా ధర్మవరం, అమరాపురం, మడకశిర మండలాల్లో మోస్తరు వర్షపాతం నమోదైంది. ఈదురుగాలులకు చాలాచోట్ల పంట, ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. ఇక గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకూ జిల్లాలోని మూడు మండలాల్లో వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఎన్పీ కుంట మండలంలో 11.4 మి.మీ, పెనుకొండ మండలంలో 4.2 మి.మీ, కొత్తచెరువు మండలంలో 3.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు. రాగల రెండు రోజులూ జిల్లాలో ఉరుములు, పిడుగులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

కదిరిలో గాలీవాన బీభత్సం

కదిరి అర్బన్: మండలంలోని చిప్పలమడుగు గ్రామంలో గురువారం రాత్రి గాలీవాన బీభత్సం చేసింది. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో 15 ఎకరాల్లో మొక్కజొన్న పంట నేలకొరిగింది. సుమారు రూ.8 లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతులు పోరెడ్డి భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, జయరామిరెడ్డి, నౌషాద్ తెలిపారు. ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని వారు కోరారు.

ఐఐటీ విద్యార్థిని ఆదుకుంటాం

సాక్షి ఎఫెక్ట్..

కదిరి: ఢిల్లీ ఐఐటీలో చదవుతూ ఆర్థిక ఇబ్బందులతో ఫీజు చెల్లించలేక ఇబ్బంది పడుతున్న మేఘనాథ్‌రెడ్డిని ఆర్థికంగా ఆదుకుంటామని ఎందరో మానవతావాదులు ముందుకొచ్చారు. మేఘనాథ్‌రెడ్డి ఆర్థిక పరిస్థితి, చదువుపై ఆయనుకున్న మమకారాన్ని వివరిస్తూ శుక్రవారం 'ఐఐటీ విద్యార్థికి ఆర్థిక కష్టం' శీర్షికన 'సాక్షి' ప్రచురించిన కథనానికి పలువురు దాతలు స్పందించారు. చాలా మంది విద్యార్థి తల్లి జయలక్ష్మికి ఫోన్ చేసి ధైర్యం చెప్పారు. అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఇంకొందరు ఆమె ఫోన్‌పే నంబర్‌కు తమ శక్తి కొలది ఆర్థిక సాయం చేశారు. కదిరి పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆత్మారెడ్డి, బీవీ శివారెడ్డి శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మేఘనాథ్‌రెడ్డి లాంటి విద్యార్థుల కోసం ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మేఘనాథ్‌రెడ్డితో పాటు అతని తమ్ముడు జయకిషోర్‌రెడ్డిని ఇంటర్‌లో చేర్చే బాధ్యత కూడా తామే తీసుకుంటామని భరోసా నిచ్చారు.

ఇంటర్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

కదిరి అర్బన్: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించడానికి గడువును పొడిగించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఈనెల 5వ తేదీ వరకూ గడువు పెంచినట్లు డీఐఈఓ సయ్యద్ మౌల తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు సమాచారాన్ని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాళ్లు విద్యార్థులకు తెలియజేయాలని ఆదేశించారు.

విద్యుత్‌శాఖ ఎస్ఈగా సంపత్‌కుమార్



పుట్టపర్తి టౌన్: జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ)గా సంపత్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఇక్కడ ఎస్ఈగా పనిచేసిన సురేంద్రబాబు ఏప్రిల్ 30న పదవీ విరమణ పొందారు. దీంతో ఉన్నతాధికారులు సురేంద్రబాబు స్థానంలో తిరుపతి ఏపీ ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో పనిచేస్తున్న సంపత్‌కుమార్‌ను నియమించారు. దీంతో శుక్రవారం ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సత్యసాయిబాబా నడయాడిన పుట్టపర్తిలో పనిచేసే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. జిల్లా వ్యాప్తంగా విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకుంటానన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులు కూడా త్వరితగతిన పూర్తి చేసేలా కృషి చేస్తానన్నారు.

తూకం.. అంతా మోసం



GAS CYLINDER SPECIFICATION

Total Weight of LPG Cylinder	Weight of Gas	Weight of Empty Cylinder
29.5kg	14.2kg	15.3kg

జిల్లాలో వివిధ కేటగిరీల్లో గ్యాస్ కనెక్షన్ల వివరాలు

దీపం	1,83,038
బీపీఎల్	10,151
ఎన్‌డీఈ	1,506
ఎన్‌డీఎన్ఈ	6,231
సింగిల్	1,41,904
డీబీసీ	93,301
సీఎస్ఆర్	31,194
డీసీఈ	1,492
ఉజ్వల	11,335
జనరల్	3,28,337
మొత్తం	8,08,489

జిల్లాలో గ్యాస్ సిలిండర్ల దందా

- తక్కువ ధరకే ఇస్తామంటూ జనానికి గాలం
- ఆశపడి కొంటే పదిరోజుల్లోనే సిలిండర్ ఖాళీ
- కర్ణాటక నుంచి దిగుమతి అవుతున్న సిలిండర్లు
- హిందూపురంలో నిల్వ సోమందేపల్లి వరకు అక్రమ రవాణా
- లబోదిబోమంటున్న వినియోగదారులు
- పట్టించుకోని అధికారులు

సాక్షి, పుట్టపర్తి

» సోమందేపల్లికి చెందిన వృద్ధ దంపతులు రెండు నెలల కిందట గ్యాస్ సిలిండర్ డెలివరీ తీసుకున్నారు. 18 రోజులకే సిలిండర్ ఖాళీ కావడంతో ఏజెన్సీ నిర్వాహకుడిని నిలదీశారు. తాము ఇద్దరమే ఉంటామని.. ఎప్పుడూ నాలుగు నెలల వరకు వచ్చే సిలిండర్ 18 రోజులకే ఎలా ఖాళీ అయ్యిందని ప్రశ్నించారు. మరో సిలిండర్ ఇవ్వకపోతే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఇరువర్గాల వాగ్వాదం తర్వాత చివరకు రూ.500 తీసుకుని మరో సిలిండర్ ఇవ్వడంతో పంచాయితీ సద్దుమణిగింది.

» హిందూపురంలో ఓ హోటల్ నిర్వాహకుడు 45 రోజుల క్రితం కమర్షియల్ సిలిండర్ తీసుకోగా... నాలుగు రోజులకే ఖాళీ అయ్యింది. దీంతో అతను గ్యాస్ డెలివరీ బాయ్‌ను నిలదీయగా.. తనకేం తెలీదంటూ తప్పించుకునే ప్రయత్నం చేశాడు. గోడౌన్‌లో ఇచ్చిన సిలిండర్‌నే తాను డెలివరీ చేశానని సమాధానం ఇచ్చాడు. వెంటనే గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడికి ఫోన్ చేయగా.. మరో సిలిండర్ ఉచితంగా ఇస్తామని.. ఎవరికీ ఫిర్యాదు చేయొద్దని వేడుకున్నారు.

» రొద్దం మండలానికి చెందిన ఓ గ్యాస్ వినియోగదారుడు.. తనకు సరఫరా చేసిన గ్యాస్ సిలిండర్ నుంచి నీళ్లు వస్తున్నాయని నెలరోజుల క్రితం సామాజిక మాధ్యమాల్లో ఓ వీడియో షేర్ చేశాడు. సిలిండర్‌లో ఉండాల్సిన లిక్విడ్ స్థానంలో నీరుందంటూ వెల్లడించాడు.

...ఇలా జిల్లాలోని హిందూపురం, పరిగి, సోమందేపల్లి, పెనుకొండ, ఓడీ చెరువు మండలాలకు సరఫరా చేస్తున్న డొమెస్టిక్, కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు ఉండాల్సిన పరిమాణం కంటే తక్కువ తూకం ఉంటున్నాయి. గట్టిగా నిలదీస్తే సిలిండర్ మార్చి ఇస్తున్నారు. లేదంటే తమకేం తెలియదంటూ బుకాయిస్తున్నారు.

గ్యాస్ దందాకు జిల్లాలో అడ్డూఅదుపు లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో కొందరు పొరుగు రాష్ట్రం నుంచి దొడ్డిదారిన గ్యాస్ సిలిండర్లు తెప్పిస్తున్నారు. తక్కువ ధరకే సిలిండర్లు ఇస్తామంటూ జనాన్ని బురిడీ కొట్టిస్తున్నారు. తక్కువ తూకం ఉన్న సిలిండర్ అంటగడుతూ జేబులు నింపుకొంటున్నారు.

కర్ణాటక నుంచి సరఫరా

గ్యాస్ సిలిండర్ల దందాలో పేరుమోసిన కొందరు పొరుగు రాష్ట్రం కర్ణాటక నుంచి తక్కువ తూకాలున్న సిలిండర్లను అక్రమంగా తెప్పించుకుంటున్నారు. అనంతరం వాటిని జిల్లాలోని వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ఇలా తూకం తక్కువగా ఉండే సిలిండర్లలో ఎక్కువ భాగం కమర్షియల్ సిలిండర్లు ఉన్నట్లు తెలుస్తోంది. తక్కువధరకు వస్తుందని ఆశపడి కొన్న సిలిండర్ వారం, పదిరోజుల్లోనే ఖాళీ అవుతుండగా.. వినియోగదారులు తాము మోసపోయినట్లు గుర్తిస్తున్నారు.

తూకాల్లో దగా

గృహావసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్‌లో లిక్విడ్ 14.2 కిలోల చొప్పున నింపుతారు. కమర్షియల్ వినియోగం అయితే 19 కిలోల చొప్పున తూకం ఉండాలి. డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల ధరలు బహిరంగపరుస్తారు. కానీ కమర్షియల్ సిలిండర్ ధరలు మాత్రం ఎడాపెడా పెంచేస్తుంటారు. నెల టార్గెట్ ప్రకారం అమ్మకాలు చేస్తుంటారు. డిమాండ్‌కు అనుగుణంగా కొందరు తక్కువ గ్యాస్ నింపి తక్కువ ధరకే గ్యాస్ సిలిండర్లు విక్రయిస్తున్నారు. ధర తక్కువగా ఉందని వెంటనే కొనుగోలు చేస్తున్న వినియోగదారులు వారం, పదిరోజుల్లోపే సిలిండర్ ఖాళీ అయ్యాక అసలు విషయం తెలుసుకుంటున్నారు.

రాత్రికి రాత్రే రవాణా

పొరుగు రాష్ట్రం కర్ణాటక నుంచి కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు రాత్రికి రాత్రే అక్రమంగా హిందూపురం మీదుగా జిల్లాలోకి సరఫరా అవుతున్నాయ. స్థానికంగా గిరాకీలను పట్టుకుని ప్రతి వారం సిలిండర్లు సరఫరా చేస్తుంటారు. అయితే హోటళ్లు, రెస్టారెంట్లు, దాభాల్లో వంటగది పర్యవేక్షణ ఒకరి చేతుల్లో ఉండదు కనుక గ్యాస్ వినియోగం ఎంతన్నది కనుక్కోవడం కష్టంగా మారుతోంది. అక్కడక్కడా చిన్న చిన్న హోటల్ నిర్వాహకులు తూకంలో తేడా గమనించి ప్రశ్నించగా.. 'మాకేం తెలీదు.. నిండుగా వచ్చింది.. ఇచ్చాం.. అంతే.. ఇష్టం ఉంటే తీసుకో.. లేదంటే లేదు' అని కరాఖండిగా చెబుతున్నారు.

లోపించిన నిఘా

హిందూపురం సరిహద్దులో రాత్రిపూట పోలీసు నిఘా లోపించడంతో బొలెరో వాహనాల్లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు అక్రమంగా రవాణా చేస్తున్నారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వస్తున్నా.. తూనికలు, కొలతల శాఖ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అధికారులు, పోలీసుల నిర్లక్ష్యానికి వినియోగదారులు బలి అవుతున్నారు. కమర్షియల్ మాటున డొమెస్టిక్ సిలిండర్లలో కూడా మోసం జరుగుతోందని.. పోలీసులకు ఫిర్యాదులు వెళ్తున్నాయి.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

"గ్యాస్ సిలిండర్ల తూకాల్లో తేడా ఉన్నట్లు అనుమానం వస్తే వెంటనే ఫిర్యాదు చేయవచ్చు. తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటాం. గోదాముల్లోనే తూకాల్లో తేడాలు వస్తే ఏజెన్సీ నిర్వాహకులదే బాధ్యత. గ్యాస్ సిలిండర్ల అక్రమ రవాణా గురించి మా దృష్టికి రాలేదు. సిబ్బంది కొరత కారణంగా నిత్యం తనిఖీలు కష్టంగా మారింది. ఫిర్యాదులు వస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.
– సుధాకర్, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్

పచ్చ నేత.. భూముల మేత

- మోతుకపల్లి లేఅవుట్‌లోని రోడ్డు స్థలం కబ్జా
- అధికారులు నోటీసులివ్వడంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు
- ఇప్పటికే ప్రభుత్వ స్థలంలో కారు పార్కింగ్ కోసం రేకుల షెడ్డు
- తొలగించాలని కోర్టు ఆదేశించినా బేఖాతరు
- టీడీపీ నేత చంద్రమోహన్ యాదవ్ తీరుపై సర్వత్రా విమర్శలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: హిందూపురానికి చెందిన టీడీపీ నేత చంద్రమోహన్ యాదవ్ తీరు రోజు రోజుకూ వివాదాస్పదమౌతోంది. రోడ్డుకోసం వదిలిన స్థలంలో ప్రహరీ నిర్మించడంతో పాటు ప్రశ్నించిన అధికారులపై చిందులేశాడు. ప్రహరీ నిర్మాణం అక్రమమని తేల్చినా కోర్టు ఆదేశాలున్నాయంటూ అధికారులనే బెదిరిస్తున్నాడు. ఆఖరుకు ఇంటి సమీపంలోని రోడ్డు స్థలాన్ని కబ్జా చేసేందుకు సిద్ధమయ్యాడు.

రోడ్డు స్థలాన్ని ఆక్రమించి...

మోతుకపల్లిలో ప్రభుత్వం వేసిన లేఅవుట్‌లో పలువురు ఇల్లు నిర్మించుకున్నారు. అందులో టీడీపీ నేత చంద్రమోహన్ యాదవ్ ఇల్లు కూడా ఉంది. అయితే లేఅవుట్‌లో రోడ్డు కోసం వదిలిన స్థలంపై చంద్రమోహన్ కన్నేశాడు. రాష్ట్రంలో కూటమి సర్కార్ కొలువుదీరగానే 10 అడుగుల ఎత్తు గోడ కట్టి ఆ స్థలాన్ని ఆక్రమించుకున్నాడు. దీంతో లేఅవుట్‌లోని వారు నేరుగా పీఎం కార్యాలయానికి ఫిర్యాదు చేయగా, అక్కడి నుంచి ఫిర్యాదు సీఎంఓకు చేరింది. దీంతో సీఎంఓ అధికారులు నేరుగా బాధితులతో మాట్లాడి విచారణకు ఆదేశించారు. మున్సిపల్ అధికారులు ఆక్రమణ నిజమని తేల్చి ప్రహరీ తీసేయాలని, లేని పక్షంలో తామే తొలగిస్తామని చంద్రమోహన్‌కు నోటీసులు అందించారు.



కబ్జా చేసిన స్థలంలో తొలగించని ఆక్రమణలు

అయితే ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు కానీ నెలరోజులు గడిచినా ఎవరూ అటువైపు కన్నెత్తి చూడలేదు. ఇదే విషయంపై గత నెలలో 'సాక్షి' కథనం ప్రచురించింది. దీంతో అధికారులు ఆక్రమణను తొలగించడానికి సిద్ధం కాగా, చంద్రమోహన్ వారిపై వాగ్వాదానికి దిగి హంగామా చేశాడు. విషయం ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏల వరకూ వెళ్లడంతో చంద్రమోహన్ కాస్త వెనక్కు తగ్గాడు. అయితే ఆ స్థలం దారి కోసం కాకుండా వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసేలా పావులు కదిపాడు. ఇదే విషయాన్ని బాలకృష్ణ పీఏ సురేంద్ర ద్వారా మున్సిపల్ కమిషనర్‌కు చెప్పించారు. అయితే ప్లాంట్ ఏర్పాటు చేసినా మిగిలిన స్థలం చంద్రమోహన్ తన ఆధీనంలోనే ఉంచుకునేందుకు ప్లాన్ వేసుకోవడంతో వివాదం మరింత ముదిరింది.

హైకోర్టు ఆదేశాలూ బేఖాతరు

టీడీపీ నేత చంద్రమోహన్ గతంలోనే ప్రభుత్వ స్థలంలో కారు పార్కింగ్ కోసం రేకుల షెడ్డు నిర్మించుకున్నాడు. దీంతో గోవిందప్ప అనే వ్యక్తి ఇంటికి ఇబ్బంది కలుగుతుండటంతో బాధితుడు హైకోర్టులో కేసు వేశాడు. దీంతో హైకోర్టు రెండు వారాల గడువులో ఆక్రమణలు తొలగించేలా ఉత్తర్వులు ఇవ్వాలని 2023లో మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలిచ్చింది. ఆక్రమణలు నిజమని గుర్తించిన మున్సిపల్ అధికారులు రేకుల షెడ్ తొలగించాలని ఉత్తర్వులు ఇచ్చారు. అయితే టీడీపీ నేత చంద్రమోహన్ కోర్టు ఆదేశాలనూ పట్టించుకోకుండా మున్సిపల్ అధికారులను బెదిరించి పంపించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

17న జేఎన్‌టీయూ స్నాతకోత్సవం

- ముఖ్య అతిథిగా గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్
- 40 మంది విద్యార్థులకు బంగారు పతకాలు

అనంతపురం: జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం అనంతపురం (జేఎన్‌టీయూ-ఏ) స్నాతకోత్సవం ఈ నెల 17న నిర్వహించనున్నారు. ఈ మేరకు యూనివర్సిటీ చాన్సలర్, ఏపీ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆమోదం తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో బీటెక్, బీ ఫార్మసీ, ఎంటెక్, ఎం ఫార్మసీ, ఎమ్మెస్సీ పూర్తి చేసిన విద్యార్థులకు స్నాతకోత్సవ పట్టాలు అందజేస్తారు. పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి డాక్టరేట్ ప్రదానం చేస్తారు. ముఖ్య అతిథిగా చాన్సలర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ స్నాతకోత్సవాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తారు. బంగారు పతకాలకు ఎంపికైన వారికి గవర్నర్ అందజేస్తారు. పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందజేస్తారు. గౌరవ డాక్టరేట్ ఎవరికి అందించాలనే అంశంపై మూడు పేర్లతో కూడిన జాబితాను గవర్నర్‌కు పంపారు. త్వరలోనే గౌరవ డాక్టరేట్ పేరు ఖరారు కానుంది. జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలోనూ, క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాల, పులివెందుల ఇంజినీరింగ్ కళాశాలలో టాపర్లు బంగారు పతకాలకు ఎంపికయ్యారు. స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేకంగా 17 కమిటీలను నియమించారు. ఇందులో ప్రొఫెసర్లను నియమించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా స్నాతకోత్సవాన్ని నిర్వహించేందుకు కమిటీలను నియమించినట్లు వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు తెలిపారు.

చిన్నారిని మింగిన కరెంటు

- క్రికెట్ బాల్ కోసం వెళ్లి విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి
- కుమారుడి మరణవార్తతో జైలులో ఉన్న తండ్రి వాల్మీకి లోకేష్‌కు అస్వస్థత
- హుటాహుటిన ఆస్పత్రికి తరలించిన జైలు అధికారులు

హిందూపురం: పాఠశాల భవనంపై పడిన క్రికెట్ బాల్‌ను తీసుకునేందుకు వెళ్లిన ఓ విద్యార్థి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం హిందూపురం ముదిరెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు...ముదిరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు వాల్మీకి లోకేష్ కుమారుడు అశ్విన్ ఆరాధ్య (11) శుక్రవారం సాయంత్రం మిత్రులతో కలిసి క్రికెట్ ఆడుకుంటూ ఉన్నాడు. ఈ క్రమంలో బాల్ పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనం పైన పడింది. బాల్‌ను తీసుకువచ్చేందుకు అశ్విన్ ఆరాధ్య భవనంపైకి వెళ్లాడు. గతరాత్రి కురిసిన వర్షంతో భవనం మొత్తం తడిగా ఉండటం...బాల్ తీసుకునే క్రమంలో సమీపంలోని విద్యుత్ తీగలు తగలడంతో అశ్విన్ ఆరాధ్య గట్టిగా కేక వేసి అక్కడే పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు, స్థానికులు పరుగున వెళ్లి బాలుడిని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.



విద్యుదాఘాతంతో మృతి చెందిన బాలుడు అశ్విన్ ఆరాధ్య

ఈ ఘటనపై హిందూపురం వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జైలులో అస్వస్థతకు గురైన తండ్రి

టీడీపీ నేతలు పెట్టిన అక్రమ కేసులో రిమాండ్‌లో ఉన్న అశ్విన్ ఆరాధ్య తండ్రి వాల్మీకి లోకేష్ కుమారుడి మరణవార్త విని కన్నీరుమున్నీరయ్యాడు. కుమారుడిని తలచుకుని జైలులో కుప్పకూలిపోయాడు. తీవ్ర అస్వస్థతకు గురైన ఆయన్ను జైలు అధికారులు హుటాహుటిన జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

8 నుంచి పీజీ పరీక్షలు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 8న ప్రారంభం కానున్నాయని డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. పీజీ పరీక్షలు ఈ నెల 13న ముగుస్తాయని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా యూజీ రెండు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్న పరీక్ష కేంద్రాలను ఆయన పర్యవేక్షించారు. శ్రీ సత్యసాయి జిల్లా కదిరిలోని నాలుగు డిగ్రీ కళాశాలలను తనిఖీ చేశారు.



పరీక్ష కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న జీవీ రమణ

వాసవీమాతకు లక్ష గాజులతో పూజలు



విశేష అలంకరణలో కన్యకాపరమేశ్వరి మూలవిరాట్



ఆలయంలో గోపూజలు చేస్తున్న మహిళలు, కమిటీ సభ్యులు



అమ్మవారికి గాజులతో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

హిందూపురం: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారి మూలవిరాట్‌ను స్వర్ణతోరణ కవచ ధారణ చేసి విశేష పూజలు చేశారు. అలాగే వాసవీమాత జయంత్యుత్సవాల్లో భాగంగా వాసవీమాత విగ్రహానికి వందలాది మంది మహిళలు గాజులతో పూజలు చేశారు. అంతకు ముందు ఆలయంలో కలశస్థాపన, గోపూజ, సువర్ణ వాసవీమాత విగ్రహ ప్రాణప్రతిష్ఠ, నవగ్రహ పూజ, మృత్యుంజయ హోమం నిర్వహించారు. వాసవీ భజన బృందం సభ్యులు అమ్మవారికి లక్ష గాజులతో పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాము, కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి రవీంద్రుడు, పలువురు కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యక్తిపై దాడి

ధర్మవరం అర్బన్: తన మేనకోడలుతో అసభ్యంగా ప్రవర్తించిన యువకుడిని మందలించేందుకు వెళ్లిన వ్యక్తిపై సదరు యువకుడుతో పాటు తల్లిదండ్రులు రాళ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన ధర్మవరంలో చోటు చేసుకుంది. టూ టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు.. వైఎస్సార్‌కాలనీలో నివాసముంటున్న యువతి పట్ల ఎదురింటిలో ఉంటున్న యువకుడు నాని అసభ్యంగా ప్రవర్తిస్తుండేవాడు. విషయాన్ని తన మేనమామ హరికి బాధితురాలు ఫోన్ చేసి తెలిపింది. దీంతో వాస్తవాన్ని నిర్ధారించుకునేందుకు వెళ్లిన హరిపై నాని, అతని తల్లిదండ్రులు రాజమ్మ, జగదీష్ గొడవకు వచ్చావా అంటూ రాళ్లతో దాడి చేసి కిందపడేసి కొట్టారు. ఘటనలో హరికి రక్తగాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు నాని, రాజమ్మ, జగదీష్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత బలవన్మరణం

గుడిబండ: మండలంలోని ఎస్‌ఆర్ హట్టి గ్రామానికి చెందిన వివాహిత రోజా (28) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... కూలి పనులతో జీవనం సాగిస్తున్న రోజాకు భర్త , ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. గొర్రెల కాపరిగా భర్త పనిచేసేవాడు. కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్న రోజా పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందింది. అయినా నయం కాకపోవడంతో తీవ్ర మనోవేదనకు లోనైన ఆమె... గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ హుక్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి పుట్టరంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

భారత వాయుసేన రిక్రూట్ మెంట్ ర్యాలీ

ప్రశాంతి నిలయం: అగ్నిపథ్ పథకంలో భాగంగా భారత వాయుసేన (ఎయిర్‌ఫోర్స్)లో మ్యూజీషియన్ ట్రేడ్‌లో ప్రవేశాలకు ప్రీ-రిజిస్టర్డ్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 11వ తేదీ లోపు రిజిస్టర్ చేసుకోవాలి. పూర్తి సమాచారానికి https://agnipathvayo వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చు.

పోక్సో కేసులో రిమాండ్‌కు నిందితుడు

నల్లమాడ: పోక్సో చట్టం కింద నమోదైన కేసులో పట్టుబడిన యువకుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నరేంద్రరెడ్డి తెలిపారు. వివరాలను శుక్రవారం ఆయన వెల్లడించారు. నల్లమాడ మండలంలోని ఓ గ్రామానికి చెందిన 15 ఏళ్ల వయసున్న బాలికను అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు ప్రేమ పేరుతో మోసగించినట్లు బాధిత బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారన్నారు. ఘటనపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో శుక్రవారం నిందితుడిని అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

వెయ్యేళ్ల చరిత్రకు నిలువెత్తు నిదర్శనం

- క్రీ.శ.950లో నిర్మించిన ఆలయం
- భక్తుల కొంగు బంగారమై విరాజిల్లుతున్న లక్ష్మీచెన్నకేశవస్వామి
- ధర్మవరంలో రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు..
- 10న బ్రహ్మ రథోత్సవం



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న లక్ష్మీచెన్నకేశవస్వామి మూలవిరాట్



లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం ముఖ ద్వారం



చెన్నకేశవస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు (ఫైల్)

ధర్మవరం అర్బన్: కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా ధర్మవరంలో కొలువైన లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం అత్యంత పురాతనమైనదిగా ప్రసిద్ధి చెందింది. దాదాపు వెయ్యి సంవత్సరాల క్రితం ఈ ఆలయాన్ని నిర్మించినట్లుగా చరిత్ర చెబుతోంది. క్రీ.శ.950లో కీచక మహామునీశ్వరుడు ఉదయాద్రి మీద తపస్సు చేసి హంపి నుంచి చెన్నకేశవస్వామి మూలవిరాట్‌ను తీసుకు వచ్చి ఇక్కడ ప్రతిష్ఠించినట్లుగా ఆధారాలు ఉన్నాయని పూర్వీకులు చెబుతున్నారు. అనంతరం హరిహర బుక్కరాయల పాలనలో సామంతరాజులు క్రియాశక్తి వడియార్ ధర్మవరంలో చెరువును తవ్వించారు. అలాగే రామగిరి మండలం కుంటిమద్ది వద్ద ఓ రైతు పొలం దున్నుతుండగా భూనీల సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ విగ్రహాలు లభ్యమయ్యాయి. అదే సమయంలో క్రియాశక్తి వడియార్‌కు స్వామి కలలో కనిపించి ధర్మాంబపురం (ప్రస్తుతం ధర్మవరం) ఆలయంలో ప్రతిష్ఠించమని అదృశ్యం కావడంతో వాటిని తీసుకువచ్చి తూర్పు దిశగా బ్రాహ్మణవీధిలో లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో ప్రతిష్ఠించారు. దేవాలయం ఏర్పడినప్పటి నుంచి అర్చకత్వం వంశపారంపర్యంగా రావడం ఇక్కడి ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుతం ప్రధాన అర్చకులుగా కోనేరాచార్యులు, అర్చకులుగా మకరందబాబు, భానుప్రకాష్ నిత్య పూజలు చేస్తున్నారు. 2013వ సంవత్సరంలో దాతలు, టీటీడీ సహకారంతో రూ.60లక్షల వ్యయంతో ఆలయ జీర్ణోద్ధరణ పనులు పూర్తి చేశారు. వివాహాలు చేసేందుకు వీలుగా కల్యాణ మంటపాన్ని నిర్మించారు.

ఏటా అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు

ప్రతి సంవత్సరం వైశాఖ శుక్ల సప్తమి నుంచి బహుళ విదియ వరకు ధర్మవరంలో అత్యంత వైభవంగా లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుంటారు. 11రోజులపాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో స్వామివారి కల్యాణోత్సవం అనంతరం బ్రహ్మ రథంపై స్వామిని ఊరేగిస్తారు. ఈ ఉత్సవానికి ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల ప్రజలతో పాటు బెంగళూరు, హైదరాబాద్, కర్నూలు, కడప తదితర ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. రథోత్సవం అనంతరం మూడురోజుల పాటు గ్రామ దేవత దుర్గమ్మ పరుష వైభవంగా నిర్వహిస్తారు.

స్వామి పాదాలను తాకే సూర్యకిరణాలు

ఏటా మాఘమాసంలో మొదటిరోజు సూర్యకిరణాలు చెన్నకేశవస్వామి మూలవిరాట్ పాదాలను తాకుతాయి. రెండో రోజు స్వామి వక్షస్థలాన్ని, మూడోరోజు మూలవిరాట్ మొత్తం సూర్యకిరణాలు తాకుతాయి. మిగిలిన రోజుల్లో సూర్యకిరణాలు స్వామిని తాకవు. ధనుర్మాసంలో నెల రోజులపాటు స్వామికి ప్రత్యేక పూజలు చేస్తారు. వైకుంఠ ఏకాదశికి దక్షిణ, ఉత్తర ద్వారాల ద్వారా భక్తులకు దర్శనమిస్తారు. వైకుంఠ ఏకాదశికి వేలాదిమంది భక్తులు స్వామిని దర్శించుకుంటారు.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు...

ధర్మవరంలో వెలసిన లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 4వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. 4న ధ్వజారోహణం, 5న ఉదయం సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనంలో స్వామి ఊరేగుతారు. 6న ఉదయం సర్వభూపాల వాహనం, సాయంత్రం సింహ వాహనం, 7న ఉదయం కల్పవృక్ష వాహనం, సాయంత్రం హనుమద్వాహనం, 8న ఉదయం పల్లకీ ఉత్సవం, సాయంత్రం శ్రీవారి కల్యాణోత్సవం ఉంటాయి. 9న ఉదయం గరుడోత్సవం, సాయంత్రం శేష వాహనం, రాత్రి గజ వాహనంపై ఉత్సవమూర్తులను ఊరేగిస్తారు. 10న ఉదయం 7 గంటలకు మడుగుతేరు (రథోత్సవం) లాగుతారు. అనంతరం సాయంత్రం వరకు స్వామిని దర్శించుకునే అవకాశం కల్పిస్తారు. సాయంత్రం 4 గంటలకు బ్రహ్మ రథోత్సవాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు ధూళోత్సవం ఉంటుంది. 11న సాయంత్రం అశ్వవాహనం, 12న ఉదయం పుష్ప మంటపం, 10 గంటలకు వసంతోత్సవం, సాయంత్రం 6 గంటలకు హంస వాహన సేవలు ఉంటాయి. 13న ఉదయం పుష్పయాగం, సాయంత్రం దేవతా ఉద్వాసన, 14న సాయంత్రం శయనోత్సవం (ఏకాంత సేవ)తో ఉత్సవాలు ముగుస్తాయి.

ఉత్సవాలకు తరలిరండి



ధర్మవరం పట్టణంలో నిర్వహించే లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొంటే కోరిన కోర్కెలు తీరుతాయి అని భక్తుల నమ్మకం. వెయ్యి సంవత్సరాల చరిత్ర కలిగిన ఆలయం కావడంతో ఇక్కడి లక్ష్మీచెన్నకేశవస్వామి చాలా మహిమాన్వితుడిగా కొలుస్తుంటారు. వాహన సేవలకు సంబంధించి కొత్తవి తయారు చేయించారు.

– వెంకటేశులు, ఆలయ ఈఓ

బాలల సంరక్షణ సదనాల సిఫార్సుల కమిటీ ఏర్పాటు



నూతన కమిటీతో సమీక్షిస్తున్న జేసీ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: జిల్లాలో బాలల సంరక్షణ సదనాల నిర్వహణకు జిల్లా స్థాయి సిఫార్సుల కమిటీని ఏర్పాటు చేశారు. శుక్రవారం జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు సభ్యులను ఎంపిక చేశారు. కమిటీలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీపీఓ ఖలీల్‌బాషా, డీసీపీఓ మహేష్, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ వినోద్, మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసులు, సీడబ్ల్యూసీ సభ్యులు ఓబులపతి, ఆదినారాయణమ్మ సభ్యులుగా ఉన్నారు. నూతన కమిటీ సభ్యులు రిజిస్ట్రేషన్ చేసుకున్న సదనాల వివరాలు, వారి అర్హతలు పరిశీలించారు. జిల్లాలో ప్రస్తుతం తొమ్మిది బాలల సంరక్షణ సదనాలు ఉన్నాయి.

గ్రానైట్ తవ్వకాలతో నష్టపోతున్నాం

- విజిలెన్స్, మైనింగ్ అధికారుల ఎదుట రైతుల ఆవేదన

రొళ్ల: గ్రానైట్ తవ్వకాలతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని విజిలెన్స్, మైనింగ్ అధికారుల ఎదుట రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. రొళ్ల మండలం గుడ్డగుర్కి పంచాయతీ పరిధిలోని గొట్టుగుర్కి గ్రామ సమీపాన సర్వే నంబర్లు 152, 157తో పాటు 93లోని బద్దికొండ, మాలకొండల్లో చేపట్టిన గ్రానైట్ తవ్వకాల పనులను గనులశాఖ, విజిలెన్స్ అధికారులు శుక్రవారం మధ్యాహ్నం పరిశీలించారు. ఈ సందర్భంగా మైనింగ్, విజిలెన్స్ అధికారులు గ్రానైట్ తవ్వకానికి ఎంత వరకు అనుమతి ఉంది, ఎంత మేరకు తవ్వారు. రాయల్టీ ఎంత చెల్లించారు అనే విషయాలపై ఆరా తీశారు. కొందరు రైతులు మాట్లాడుతూ... బద్దికొండ, మాలకొండల్లో చేపట్టిన గ్రానైట్ తవ్వకాల వల్ల తాము తీవ్రంగా నష్ట పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బద్దికొండను ఆనుకుని వందలాది ఎకరాల సాగు భూమితో పాటు చెక్‌డ్యాంలు, కుంటలు, కట్టలు, వ్యవసాయ బోరుబావులు, సారవంతమైన భూములు ఉన్నాయన్నారు. అంతే కాక గ్రానైట్ తవ్వకం వల్ల జరిగిన నష్టానికి ఇప్పటి వరకూ పరిహారం కూడా చెల్లించలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని గ్రానైట్ తవ్వకాల పనులు నిలిపి వేయాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రాయల్టీ చెల్లించకుండా గ్రానైట్ తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవని గనులశాఖ (మైనింగ్) అధికారులు ఖాజాహుస్సేన్, పురుషోత్తం, సునీతతో పాటు విజిలెన్స్ అధికారులు నాగభూషణ్, జమాల్‌బాషా, వాసుప్రకాష్ తదితరులు హెచ్చరించారు. రైతుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వీఆర్వో రంగనాథ్, మైనింగ్, విజిలెన్స్‌తో పాటు రెవెన్యూశాఖ సిబ్బంది, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు... విజ్ఞాన కేంద్రాలు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న పర్సన్ ఇన్‌చార్జ్ శివ్‌నారాయణ్ శర్మ

అనంతపురం: గ్రంథాలయాలు భవిష్యత్తు తరాలకు విజ్ఞాన కేంద్రాలని పర్సన్ ఇన్‌చార్జ్ హోదాలో అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ అన్నారు. గ్రంథాలయాల అభివృద్ధి అంశంపై జిల్లాలోని 79 గ్రంథాలయాధికారులతో కలసి జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం ఆయన సమీక్షించారు. నిర్ణీత సమయానికి గ్రంథాలయాలు తెరచి ఉంచాలన్నారు. గ్రంథాలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. గ్రంథాలయా పన్నుల వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పంచాయతీ, మున్సిపాలిటీ వారి నుంచి నిర్ణీత సమయంలో పన్నులు రాబట్టాలన్నారు. గ్రంథాలయాలను ఆదర్శంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాలపై పాఠకులకు అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఉద్యోగ విరమణ చేసిన వారిలో స్వచ్ఛందంగా సేవ చేసే దృక్పథం ఉన్న వారిని రీసోర్స్ పర్సన్‌లుగా ఎంపిక చేయాలన్నారు. వీరి నుంచి గ్రంథాలయాలకు వచ్చే విద్యార్థులకు డ్రాయింగ్, నృత్యం, పెయింటింగ్, సంగీత వాయిద్యాల శిక్షణ అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రెటరీ పి. రమ తదితరులు పాల్గొన్నారు.

బీసీ గురుకులాల కన్వీనర్‌గా అఫ్రత్‌వలి

అనంతపురం ఎడ్యుకేషన్: మహాత్మ జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల విద్యాలయాల కన్వీనర్‌గా కొనకొండ్ల గురుకుల పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు జి.అఫ్రత్‌వలి నియమితులయ్యారు. ప్రస్తుతం కన్వీనర్‌గా పనిచేస్తున్న కేజే జోనాథన్ గత నెల 29న పదవీవిరమణ పొందారు. ఈ క్రమంలో అఫ్రత్‌వలికి జిల్లా కన్వీనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఎంఎల్‌హెచ్‌పీల డిమాండ్లు నెరవేర్చాలి



ఎంఎల్‌హెచ్‌పీల ఆందోళనకు మద్దతు తెలిపి, సమస్యలు తెలుసుకుంటున్న దుద్దుకుంట శ్రీధరరెడ్డి

- మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధరరెడ్డి డిమాండ్

పుట్టపర్తి అర్బన్: ఎంఎల్‌హెచ్‌పీలు, సీహెచ్‌ఓల న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర రెడ్డి డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ గత ఐదు రోజులుగా డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట ఎంఎల్‌హెచ్‌పీలు, సీహెచ్‌ఓలు చేపట్టిన నిరవధిక సమ్మెకు శుక్రవారం ఆయన మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్య శాఖను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. ఎంఎల్‌హెచ్‌పీలు, సీహెచ్‌ఓల సమస్యలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకెళతామన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్మన్ మాతంగి తిప్పన్న, పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రవినాయక్, మాజీ కన్వీనర్ మాధవరెడ్డి, ఎన్‌జీఓ సంఘం అధ్యక్షుడు లింగా రామమోహన్ తదితరులు ఉన్నారు.

డబ్బులివ్వండి పని చేస్తాం!

- నీటి సమస్య పరిష్కారం కోసం వచ్చిన ప్రజలతో పంచాయతీ కార్యదర్శి
- సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వీడియో

చిలమత్తూరు: 'ఖజానా ఖాళీగా ఉంది. మీరు డబ్బులిస్తే పని పూర్తి చేయిస్తాం' అంటూ సమస్య పరిష్కారానికి వచ్చిన గ్రామస్తులపై పంచాయతీ కార్యదర్శి సావిత్రి తన దూకుడు ప్రదర్శించారు. వివరాల్లోకి వెళితే... చిలమత్తూరు మండలం కొత్త చామలపల్లి గ్రామానికి పది రోజులుగా తాగునీటి సరఫరా కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కారంపై పంచాయతీ కార్యదర్శి దృష్టి సారించకపోవడంతో స్థానికులు విసుగెత్తి కార్యాలయానికి వెళ్లారు. ఆ సమయంలో కంప్యూటర్ సెక్షన్‌కు ఎందుకు వచ్చారంటూ వారిపై పంచాయతీ కార్యదర్శి చిందులేశారు. తమకు తెలియక వచ్చామని చెబుతున్నా వినకుండా తనదైన శైలిలో రెచ్చిపోయారు. నీటి సమస్య తీర్చాలని గ్రామస్తులు కోరితే డబ్బుల్లేవంటూ పంపించి వేశారు. ఈ మొత్తం అంశాన్ని స్థానికులు వీడియో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయడం సంచలనం రేకెత్తించింది. సామాన్య ప్రజలపై పంచాయతీ కార్యదర్శి దురుసు ప్రవర్తన పలు విమర్శలకు దారి తీసింది. మండల స్థాయి ఉన్నతాధికారి అండతోనే కార్యదర్శి ఇలా ప్రజలంటే లెక్కలేని తనాన్ని ప్రదర్శిస్తున్నారని ఈ సందర్భంగా పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సమస్య తహసీల్దార్‌కో.. ఎస్‌ఐకో అయితే ఆగమేఘాలపై చర్యలు తీసుకుని పరిష్కరిస్తారని, సామాన్యులు అడిగితే మాత్రం డబ్బుల్లేవంటూ బుకాయిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు చర్యలు తీసుకుని తమ గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

ఆత్మీయ సమ్మేళనం

పుట్టపర్తి టౌన్: సత్యసాయి బాబా తన మాతృమూర్తి ఈశ్వరమ్మ పేరిట స్థాపించిన ఉన్నత పాఠశాలలో 1998–99 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారు స్థానిక సాయి ఆరామంలో శుక్రవారం ఒక్కటయ్యారు. పాతికేళ్ల తర్వాత కలుసుకున్న వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులను సత్కరించారు.

ప్రాణం బలిగొన్న అతి వేగం



నుజ్జునుజ్జయిన కారు



మృతుడు మంజునాథ్

రాప్తాడు: అతి వేగం ఓ వ్యక్తి ప్రాణాలను బలిగొంది. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని దేవనహళ్లి గ్రామానికి చెందిన మంజునాథ్ (44), ప్రతాప్, అమర్‌నాథ్, నగేష్... కేఏ50ఏ 9691 నంబర్ గల కారులో మంత్రాలయ క్షేత్ర దర్శనానికి వెళ్లారు. అక్కడ పూజాదికాలు ముగించుకున్న అనంతరం శుక్రవారం దేవనహళ్లికి తిరుగు ప్రయాణమయ్యారు. రాప్తాడు మండలం రామినేపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై అతి వేగంగా వెళుతున్న కారు డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న పల్లంలోకి పల్టీలు కొడుతూ బోల్తాపడింది. ఘటనలో కారు నడుపుతున్న మంజునాథ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రతాప్, అమర్‌నాథ, నగేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళుతున్న వారు గుర్తించి క్షతగాత్రులను 108 వాహనం ద్వారా అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై రాప్తాడు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జేఎన్‌టీయూ విద్యార్థులకు వర్చువల్ ఇంటర్న్‌షిప్



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న దృశ్యం

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) విద్యార్థులకు వర్చువల్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంను అందుబాటులోకి తెచ్చినట్లు ఆ వర్సిటీ వీసీ డాక్టర్ హెచ్.సుదర్శనరావు తెలిపారు. ఇందు కోసం హైదరాబాద్‌లోని స్మార్ట్ బ్రిడ్జ్ ఎడ్యుకేషన్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు వివరించారు. ఒప్పందంలో భాగంగా ఎక్స్‌పీరియన్షియల్ లర్నింగ్, వర్చువల్ ఇంటర్న్‌షిప్‌ను విద్యార్థులకు అందించనున్నట్లు పేర్కొన్నారు. జేఎన్‌టీయూ (ఏ) విద్యార్థులకు ఇది చాలా ఉపయోగకరమని అభిప్రాయపడ్డారు. సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకునేలా సాఫ్ట్ స్కిల్స్ అభ్యసించేందుకు కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఓఎస్డీ టూ వీసీ ఆచార్య ఓ.దేవన్న, రిజిస్ట్రార్ ఎస్. కృష్ణయ్య, డీఏపీ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, ప్రొఫెసర్ సి.శోభాబిందు, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చెన్నారెడ్డి, స్మార్ట్ బ్రిడ్జ్ ఎడ్యుకేషన్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు శ్రీ దేవి సిరా పాల్గొన్నారు.

శభాష్ వర్ణిక!



సీఐ సాయిప్రసాద్ సమక్షంలో భాస్కర్‌నాయక్‌కు డబ్బు అందజేస్తున్న వర్ణిక

తాడిపత్రిటౌన్: 'వట్టి మాటలు కట్టిపెట్టోయ్... గట్టి మేలు తలపెట్టవోయ్' అన్న గురజాడ అప్పారావు మాటలను 14 ఏళ్ల బాలిక వర్ణిక ఆచరణలో పెట్టి పోలీసులతో శభాష్ అనిపించుకుంది. వివరాలు... గత నెల 30న తాడిపత్రి మండలం అయ్యవారిపల్లికి చెందిన భాస్కర్ నాయక్ తాడిపత్రిలోని మెయిన్ బజార్‌లో ఉన్న యూనియన్ బ్యాంక్ ఏటీఎంలో రూ.9వేలు డ్రా చేసేందుకు ప్రయత్నించాడు. అయితే బ్యాంక్ ఖాతా నుంచి నగదు డ్రా అయినా.. ఏటీఎం నుంచి రాలేదు. చాలా సేపటి వరకూ ఆయన అక్కడే వేచి చూశాడు. అయినా డబ్బు రాక పోవడంతో విసుగు చెంది వెళ్లిపోయాడు. కాసేపటి తర్వాత అదే ఏటీఎం కేంద్రానికి డబ్బు డ్రా చేసుకునేందుకు యల్లనూరు మండలం సింహాద్రిపురం గ్రామానికి చెందిన బాలిక వర్ణిక వెళ్లింది. అయితే అప్పటికే ఏటీఎంలో నగదు కనిపించడంతో ఆశ్చర్యపోయిన బాలిక... చుట్టుపక్కల పరిశీలించింది. అక్కడ ఎవరూ లేకపోవడంతో ఆ డబ్బు తీసుకెళ్లి నేరుగా సీఐ సాయిప్రసాద్‌కు అందజేసింది. లెక్కిస్తే రూ.9వేలు ఉన్నాయి. పోలీస్ విచారణలో ఆ డబ్బు అయ్యవారిపల్లికి చెందిన భాస్కర్ నాయక్‌దని గుర్తించిన పోలీసులు శుక్రవారం ఆయనను పీఎస్‌కు పిలిపించి వర్ణిక చేతుల మీదుగా అందజేయించారు. ఈ సందర్భంగా వర్ణికను పోలీసు అధికారులు, సిబ్బంది అభినందించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



మృతుడు లింగారెడ్డి

లేపాక్షి: మండల కేంద్రంలోని ఓ మద్యం దుకాణం ఎదుట శుక్రవారం సాయంత్రం ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడిని ధర్మవరానికి చెందిన లింగారెడ్డి(53)గా గుర్తించారు. లేపాక్షి మండలం బిసలమానేపల్లిలో కూలీ పనులకు వచ్చిన ఆయన పని అనంతరం మద్యం సేవించేవాడు. ఈ క్రమంలోనే శుక్రవారం సాయంత్రం పనులు ముగించుకుని మద్యం సేవించాడు. మరో బాటిల్‌ను నిక్కర్ జేబులో ఉంచుకుని వెళుతూ మద్యం దుకాణానికి కూత వేటూ దూరంలో కుప్పకూలాడు. గమనించిన స్థానికులు అక్కడకు చేరుకుని ఉపశమన చర్యలు చేపట్టేలోపు మృతి చెందాడు. మృతుడి వద్ద మద్యం బాటిల్‌తో పాటు బీడీ కట్టలు, అగ్గిపెట్టె, హాన్స్ ప్యాకెట్లు లభ్యమయ్యాయి. కాగా, కల్తీ మద్యం సేవించడం వల్లనే మరణించి ఉంటాడనే అనుమానాలు వ్యక్తం కావడంతో మద్యం ప్రియులు ఆందోళన వ్యక్తం చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.